తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



### కొండపై స్వామిఅమ్మవార్ల

# పూలబంతులాట

**-వేడుకగా ప్రణయ కలహోత్సవం**

తిరుమల,జనవరి 7ప్రభాతవార్తప్రతినిధి:

పవిత్రమైన ధనుర్మాసం....ప్రత్యేకించి విశేషమైన శనివారం సాయంత్రం దేవదేవుడు శ్రీనివాసుడు, భూదేవిశ్రీదేవి అమ్మవార్లు తరపున అర్చకులు పూలబంతూలాటతో వేడుకగా ప్రణయకలహోత్స వం జరిగింది. వైకుంఠ ఏకాదశి అనంతరం ఆరవరోజు ఈ వేడుకలు జరపడం, స్వామిఅమ్మవార్లకు కర్పూర హారతులు ఇచ్చి ఆలయానికి వేంచేపుచేయడంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయంగారు, చిన్నజీయంగారు. ఆలయ డిప్యూటీ ఇఓ రమేష్‌బాబు, విజిఓ బాలిరెడ్డి పాల్గొన్నారు.

### పారదర్శక పాలనకే

# గడప గడపకు కార్యక్రమం

### డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మొండివెంగనపల్లెలో గడప గడప కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

వెదురుకుప్పం, జనవరి 7 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రజలందరికి పారదర్శక పాలన అందించి సంక్షేమ పథకాలు ప్రజలకు మరీంత చేరువ చేయడం కొరకే గడప గడపకు వైసీపీ ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి కళత్తూరు నారాయణస్వామి పేర్కొన్నారు.మండలంలోని మొండివెంగనపల్లె పంచాయితీలో శనివారం గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాపుమొండివెంగనపల్లె, బలిజమొండివెంగనపల్లె,బండమీదఇండ్లు గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి ప్రజలను పలకరించి జగనన్న ప్రభుత్వం అందిస్తూన్న సంక్షేమ ఫలాలు అందుతున్న వైనంను ప్రశ్నించి తెలుసుకున్నారు. అలాగే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజా సంకల్ప యాత్ర సమయంలో ప్రజలకు ఇచ్చిన హామిని నేరవేరుస్తూన్న ఘనత జగనన్నకు మాత్రమే దక్కుతుందని, ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకాలను ప్రవేశ పెట్టి ప్రణాళిక ప్రకారం అమలు చేస్తున్న ఏకైక నాయకుడని స్పష్టం చేశారు. మోసపూరిత హామిలు, వాగ్ధనాలతో ప్రజలను మోసం చేయడంకు చంద్రబాబు నాయుడు మాటలు నమ్మిమోసపోవద్దని చూచించారు. గడప గడప కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్ధానం కంప్యూటర్ ఆపరేటర్లకు ఆదుకోవాలని వినతి పత్రం అందించారు. అభివృద్ధిని చూసి ప్రజలు జగనన్న వైపునిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్ధానిక సర్పంచ్ పోటూగారి లలిత భాస్కర్, మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు లోకనాధ రెడ్డి, ఎంపిడివో సుధాకర్‌రావు, తహాశీల్ధార్ పుల్లా రెడ్డి, నాయకులు బట్టే సుబ్రమణ్యం, ధనంజేయులు రెడ్డి, మాధవరావు, బండి హేమసుందర్ రెడ్డి, మేలిపాటి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

**అర్హులైన అవ్వతాతలకు అక్కచెల్లెలకు కొత్త పెన్షన్లు**

అర్హులైన ప్రతి అవ్వతాతలకు ... అక్కచెల్లెలకు ... విర్యాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు జనవరి నుంచి వృద్దులకు, వితంతువులకు 250 రూపాయలు అందనంగా పెంచిన ఇవ్వడం జరిగిందని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం వద్ద కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ దశల వారిగా 250 రూపాయలు చొప్పున పెంచడం జరుగుతుందని ఆమేరకు కొత్త సంవత్స రంలో జనవరి నుంచి పెంచడం జరిగిందన్నారు. అవ్వతాతలు, అక్కచెల్లెలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, ఎంపీపీ బండి నాగరాణి, ఎంపిడివో సుధాకర్‌రావు, తహాశీల్ధార్ పుల్లా రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# ఇసిఎల్ వద్ద ఉద్రిక్తత

**యాజమాన్యంతీరుతో చిందేపల్లి వాసులు తిరుగుబాటు**
**మోహరించిన పోలీసులు: అధికారులు -ససేమిరా అంటున్న గ్రామస్తులు**

శ్రీకాళహస్తి రూరల్,జనవరి 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద ఏర్పడ్డ ఇసిఎల్ భారీ పరిశ్రమ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. చిందేపల్లి గ్రామస్థులు శనివారం ఉదయం నుంచి ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగారు.చిందేపల్లి గ్రామానికి చెందినమహిళలు భారీ ఎత్తున హాజరై బైఠాయించారు. ఉదయం నుంచి ఇక్కడే తిండిలేక తిప్పలు పడుతూ బైఠాయించారు. ఆందోళనకు సంబంధించిన కారణాలు పరిశీలించగా వందల సంవత్స రాల నుంచి చిందేపల్లిలోని సుమారు 300 కుటుంబాలకు శ్రీకాళహస్తి-తిరుపతి రహదారి నుంచి రాచగున్నేరిరైల్వే స్టేషన్ సమీపం నుంచి రహదారి ఉంది.గ్రామస్తులు ఈ మార్గం గుండానే వెళ్ళే వారు. అయితే ఇటీవల లాంకో ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్ ఇసిఎల్ స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి వివాదాలు గోడవలు చోటు చేసుకుంటున్నాయి. శ్రీకాళహస్తి డివైయస్‌పిగా పనిచేసిన ఓ పోలీసు అధికారి అభిషేకంను ఇక్కడ పిఆర్‌ఓగా నియమించుకున్నారు.ఆయన విధానాలతో వివాదాలు చోటు చేసుకుంటున్నట్లు చర్చించుకుంటున్నారు.గ్రామానికి సంబంధించిన రోడ్డును ఆక్రమించి గ్రామస్థులను జగనన్న కాలనీ మీదుగా పంపుటకు కంపెనీ ప్రణాళిక రూపొందించుకుంది. అయితే ఎప్పటి కప్పుడు ఫ్యాక్టరీ ఎత్తుగడలను చిందేపల్లి వాసులు అడ్డుకుంటూ తమ రోడ్డు హక్కునుమీరు ఎలా హరిస్తారని అడ్డుకుంటున్నారు.ఈ నేపథ్యంలో గత ఏడాది డిసెంబర్ 31 రాత్రి ఫ్యాక్టరీ దారికడ్డంగా కందకంను తవ్వటానికి ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. దాంతో రూరల్ సిఐ కృష్ణమోహన్, ఎస్ఐ వెంకటేష్‌లు పంచాయతీ జరిపారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అయితే రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదు.అంతేకాక ఫ్యాక్టరీ కవ్వింపు చర్యగా శనివారం ఉదయం పిఆర్‌ఓ సారథ్యంలో రోడ్డును జెసిబిలు పెట్టి తవ్వించటంతో గ్రామస్థులు తిరగబడ్డారు.ఉదయం నుంచి ఫ్యాక్టరీ వద్ద బైఠాయించారు.



రోడ్డు కడ్డంగా గుంత తవ్విన మేనేజ్‌మెంట్, అధికారులతో వాగ్వాదం

**పరులుగు తీసిన రెవెన్యూ,పోలీసులు:**

శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద చిందేపల్లి గ్రామస్థులు,మేనేజ్‌మెంట్‌మధ్య వివాదాలు చెలరేగటంతో ఉద్రిక్తత పరిస్తితి చోటు చేసుకుంది. దాంతో శ్రీకాళహస్తి తహాశీల్దార్ జరీనా, రూరల్ సిఐ కృష్ణమోహన్, ఏర్పేడు సిఐ శ్రీహరి, రూరల్‌ఎస్ఐ వెంకటేష్, ఏర్పేడు ఎఎస్ఐ హబీబ్‌ల పర్యవేక్షణలో ఇసిఎల్ వద్దకు చేరుకున్నారు. మరో సారి చిందేపల్లి వాసులను శాంతపరచుటకు పంచాయతీలు ప్రారంభించారు.అయితే గ్రామస్థులు పిఆర్‌ఓ అభిషేకంపై రాతమూలకంగా ఫిర్యాదు చేసారు. ఆతని మీద కేసునమోదు చేయనిదే తాము ఇక్కడ నుంచి కదిలేదిలేదని మొండికేసారు. అయితే ఓ వైపు తహాశీల్దార్ జరినా,మరో వైపు సిఐలు కృష్ణమోహన్, శ్రీహరి గ్రామస్థులతో చర్చలు జరుపుతున్నా వందలసంవత్స రాల మాహక్కులపై ఫ్యాక్టరీ పెత్తనం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

# చిత్తూరు జిల్లా డిఐజి విచారణ



నాయుడుపేట, జనవరి 7 ప్రభాతవార్త

నాయుడుపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చిత్తూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ డిఐజి గిరిబాబు విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట పట్టణం అగ్రహారపేటలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన సర్వేనంబర్ 71-1లో మూడున్నర అంకణాల భూమి ఉంది. దాన్ని రిజిస్ట్రేషన్ చేయడానికి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వెళ్లి సంబంధిత పత్రాలు సమర్పించారు. అయినప్పటికీ వివిధ రకాల పత్రాలు తీసుకురావాలని నెలరోజుల పాటు తిప్పుకున్నట్లు బాధితుడైన మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చివరికి రూ.50 వేలు ఇస్తే కాని రిజిస్ట్రేషన్ చేసేది లేదని రిజిస్ట్రార్ శోభమ్మ డిమాండ్ చేసినట్లు బాధితుడు వాపోయాడు. తనకు రూ.50 వేలు చెల్లించే స్థోమత లేక ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈ క్రమంలోనే శోభమ్మపై డిఐజి గిరిబాబు విచారణ చేపట్టారు. ఇదిలావుంటే బాధితుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంతగా తమను ఇబ్బంది పెట్టిన నేపథ్యంలో తనకు రిజిస్ట్రేషన్ అవసరం లేదని, రిజిస్ట్రార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని బాధితుడు డిమాండ్ చేశాడు. డిఐజి గిరిబాబు బాధితుడితో పాటు అధికారులను విచారించారు.

# గ్రూప్ 1 పరీక్షలకు గట్టి భద్రతా చర్యలు

**పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్ అమలు**
**జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి**



తిరుపతి క్రైం, జనవరి 7, ప్రభాతవార్త

ఈ నెల 8న జరిగబోయే గ్రూప్ 1 పరీక్షల నేపథ్యంలో జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి శనివారం ఎస్పి కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూప్ 1 పరీక్షలకు బందోబస్తు ఆవస్యకతపై అధికారులకు సూచనలతో పాటు భద్రతపై గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి నగరంలో 14 సెంటర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నందుకు అభ్యర్ధులు ఆయా సెంటర్‌లో నిర్ణీత సమయంలోగా హాజరు కావాలని పరీక్షలు ఉదయం 10 గంటల నుండి 12 వరకు మధ్యాహ్నాం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుంది. గ్రూప్ 1 పరీక్ష జరుగు సమయంలో పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లు, ప్రింటింగ్ సెంటర్లు, సెల్‌ఫోన్ షాప్‌లు, ఎలక్ట్రానిక్స్ సంబంధించిన షాప్స్ మొదలైన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మూసివేయాలన్నారు. పరీక్షలకు ఎలాంటి ఆటంకం కలగకుండా గట్టి భద్రత చర్యలను పోలీస్ శాఖ తీసుకుందని అభ్యర్థులు తమ వెంట సెల్‌ఫోన్లతో పాటు విలువైన వస్తువులు ఏది తీసుకురాకూడదన్నారు. పరీక్ష వద్ద నిర్ణీత సమయంలోగా హాజరయ్యే విధంగా అభ్యర్థులు సమయాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రూప్ 1 వ్రాత పరీక్షల బందోబస్తు నిమిత్తం జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు డిఎస్‌పిలు 02, సిఐలు 10, ఎస్ఐలు 14, ఏఎస్ఐ, హెచ్‌సి, పిసిలు 100 వీరితో పాటు స్పెషల్ పార్టీలు ప్రతి సెంటర్ నందు డిఎఫ్‌ఎండి అలాగే అదనంగా రక్షక్ మొబైల్స్, బ్లూ కోల్ట్స్ సిబ్బందితో గ్రూప్ 1 వ్రాత పరీక్షల సెంటర్ల వద్ద బందోబస్తు నిమిత్తం ఏర్పాటు చేయడం జరిగింది. అభ్యర్ధులు నిర్ణీత సమయం కంటే ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

### జల్లికట్టుకు అనుమతి లేదు : ఎస్పీ

తిరుపతి క్రైం , జనవరి 7, ప్రభాతవార్త

జల్లికట్టుకు అనుమతి లేనిది తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సుఖ సంతోషాలతో చేరుకోవాలని కోరారు. సాంప్రదాయం ఆనవాయితీ ముసుగులో సమస్యలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూగ జవాలను హింసించడం నేరమని తెలిపారు. జల్లి కట్టు నిర్వహించ గ్రామాలలో కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు నోటీసులు జారీ చేశామని తెలిపారు. జల్లికట్టు సమయంలో ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ మెల్లగా వ్యాప్తి చెందుతుందని నిబంధనలు పాటిస్తూ సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎస్పి తెలిపారు.





యునజనోత్సవంలో విన్నర్‌గా నిలిచిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

# ఘనంగా యువజనోత్సవాల ముగింపు

తిరుపతి (విద్య), జనవరి 7, ప్రభాతవార్త

పద్మతరంగ్ 36వ ఇంటర్ యువజనోత్స వ ముగింపు సభ శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో శనివారం ఉదయం 11 గంటలకు ఘనంగా నిర్వహించారు. వేదికపై చీఫ్ గెస్ట్ విసి ప్రొఫెసర్ డి. జమున, అలేఖ్య పుంజారా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని, చీఫ్ కోఆర్డినేటర్ ఆఫీసర్స్, ప్రొఫెసర్ అనురాధ, ప్రొఫెసర్ త్రిపుర సుందరి, కన్వీనర్ ఆర్ఎన్ఎస్ శైలేశ్వరి ఆసీనులయ్యారు. ముందుగా ప్రార్ధనతో సభ ప్రారంభమైంది. ముందుగా కన్వీనర్ శైలేశ్వరి ఐదు రోజుల గురించి బ్రీఫ్ నోట్ ప్రెసెంట్ చేశారు. తరువాత వైస్ చాన్స లర్ ప్రొఫెసర్ డి. జమున మాట్లాడుతూ అన్ని పార్టిసిపెంట్ యూనివర్సిటీస్ ఇచ్చిన హార్మోని అండ్ కోఆపరేషన్ చాలా బాగుందని తెలిపారు. ఇది వన్‌నెస్ అన్నారు. యూత్ చాలా ముఖ్యమైన రోల్ ప్లే చేస్తుందని నేషన్ డెవలప్మెంట్‌లో నేషనల్ ఇంటిగ్రిటీని దక్షిణాది భారతీయులు చక్కగా ప్రదర్శించారని తెలిపారు. యూనిటీ ఇన్ డైవర్సిటీ అని తెలిపారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా మ్యూజిక్ ఈవెంట్స్ మహాత్మ గాంధీ యూనివర్సిటీ కొట్టాయం విన్నర్‌గా, యూనివర్సిటీ ఆఫ్ కేరళని రన్నరప్‌గా ప్రకటించారు. డ్యాన్స్ ఈవెంట్స్ శ్రీ శంకరాచార్య యూనివర్సిటీ ఆఫ్ సాంస్క్రిట్ కాలాడి, కేరళని విన్నర్‌గా, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంని రన్నరప్‌గా ప్రకటించారు. లిటరరీ ఈవెంట్స్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ విన్నర్స్‌గా కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కొచ్చిన్ రన్నరప్‌గా ప్రకటించారు. థియేటర్ ఈవెంట్స్ యూనివర్సిటీ ఆఫ్ కేరళని విన్నర్స్‌గా, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళని రన్నరప్‌గా ప్రకటించారు. ఫైన్ ఆర్ట్స్ యోగివేమన యూనివర్సిటీ, కడప ఏపిని విన్నర్స్‌గా, మహాత్మా గాంధీ యూనివర్సిటీ కొట్టాయం రన్నరప్‌గా ప్రకటించారు. అన్నీ ఈవెంట్స్‌ని లెక్కకి తీసుకుని ఓవరాల్ చాంఫియన్‌షిప్ యూనివర్సిటీ ఆఫ్ కేరళని విన్నర్‌గా మహాత్మగాంధీ యూనివర్సిటీ కొట్టాయంని రన్నరప్‌గా ప్రకటించారు.

### గదుల ధరలు పెంపు

# సమంజసమే !

**చక్కటి వసతులు సమకూర్చడంతోనే అద్దె మార్పు**
**:బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్**

తిరుమల,జనవరి 7ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలకొండపై భక్తుల సౌకర్యార్థం అతిధిగృహాలు, విశ్రాంతి గృహాల గదులను అత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించడంతోనే గదుల అద్దె పెంచడం జరిగిందని ,దీనిపై అపోహాలు అనవసర మని టిటిడి పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. సుమారు 119కోట్లు రూపాయలు వెచ్చించి గదుల ఆధునీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో ప్రత్యేకించి నారాయణగిరి 1,2,3,4 విశ్రాంతి గృహాలలో చక్కటి టైల్స్ ఫ్లోరింగ్, ఏసిలు, గీజర్లు మార్చడంతో బాటు కొత్త కొయ్య మంచాలను, నాణ్యమైన పరుపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వయంగా తానే ఎస్టేట్ కమిటీలో ఓ సభ్యుడిగా పర్యవేక్షించి రేట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. చక్కటి వసతులు సమకూర్చడంతోనే ఈ గదుల అద్దె తప్పకుండా పెంచాల్సి న అవసరం వచ్చిందన్నారు. అంతేగానీ సామాన్యభక్తులు బసచేసే కాటేజీ గదుల అద్దెను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచబోమన్నారు. ఆ గదులను ఆధునీకరించామని, అయినా టిటిడి సామాన్యభక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. టిటిడిలో ముఖ్యంగా తిరుమలలో దర్శనాలు, వసతి, లడ్డూప్రసాదాలు తదితరవాటిల్లో పారదర్శకత అములవుతోందని పోకల అశోక్‌కుమార్ చెప్పారు. శనివారం మీడియాప్రతినిధులతో మాట్లాడుతూ అనవసరంగా విమర్శలు చేయడం కాదని, భక్తుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని టిటిడి ముందుకు వెళుతుందన్నారు.

# ప్రసూతి మరణాలు కట్టడికి పక్కా చర్యలు

**కలెక్టర్ హరినారాయణన్**



చిత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త:

జిల్లాలో ప్రసూతి మరణాలు సంభవించకుండా పక్కా చర్యలు తీసుకోవాలని ఈ విషయంపై ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హరినారాయణన్ హెచ్చరించారు. కలెక్టర్ హరినారాయణన్ అధ్యక్షతన శనివారం 2022 ఏప్రిల్ నుండి డిసెంబర్ నెల వరకు జరిగిన ప్రసూతి మరణాలపై మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో పలు సంస్కరణలు చేపట్టి ప్రజలకు సత్వరం వైద్య సేవలు అందించడానికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రజారోగ్యం పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్యసేవలను విస్తృతం చేయడానికి అనేక సంస్కరణలు చేపట్టిందన్నారు. ఈ సంస్కరణలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందేలా డాక్టర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రసూతి మరణాలు సంభవించకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో గర్భం దాల్చిన మహిళలు తీసుకోవాల్సి న ఆరోగ్య జాగ్రత్తలు, సుఖప్రసవం జరిగేలా, పుట్టిన బిడ్డకు తల్లిపాలు మాత్రమే అందించేలా ప్రతి విషయంలోను ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గర్భవతులకు ప్రసవానికి ముందు నుండి వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో వుండి వారికి అవసరమైన వైద్య సేవలను అందించాలన్నారు. ప్రతి గర్భిణీకి సుఖ ప్రసవం జరిగేలా చేసి తల్లి బిడ్డ క్షేమంగా ఇంటికి వెళ్ళేవరకు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. గర్భవతులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, రక్తహీనత లేకుండా సుఖ ప్రసవం జరిగేలా ఎఎన్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని పిడియాట్రిక్ వార్డులో వెంటిలేటర్లు లేదనే విషయంను సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సత్వరం ఈ వార్డులో వెంటిలేటర్లు ఏర్పాటు చేయాలని డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాయక్‌ను ఆదేశించారు. అలాగే పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం అనే విషయంను వైద్య ఆరోగ్యశాఖ విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాయక్, డిఐఓ డాక్టర్ రవిరాజు, డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిబ్రవరిలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

**వినాయక సాగర్ చుట్టూ చూపరులను ఆకట్టుకోవాలి**
**మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి**

తిరుపతి కార్పొరేషన్, జనవరి 7, ప్రభాతవార్త

నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, అనుపమ అంజలి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శనివారం వినాయక సాగర్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్మార్ట్ సిటీలో భాగంగా బొంతాలమ్మ ఆలయం వద్ద గల వినాయక సాగర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. హుస్సేన్ సాగర్ తరహాలో వినాయక సాగర్ అభివృద్ధి ధీటుగా ఉండాలని, వినాయక సాగర్ చుట్టు పక్కల చూపరులకు ఆకట్టుకునే విధంగా సుందరంగా ఉండే విధంగా చూడాలని, వినాయక సాగర్ పనులు త్వరగా పూర్తి చేయడం కోసం ఎక్కువ మంది మనుషులను పెడితే పనులు తొందరగా పూర్తవుతాయని, ఫిబ్రవరిలో ప్రారంభోత్సవం చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. డివైడర్‌లో అందమైన చెట్లు ఉండాలని, అలాగే సాగర్ గట్టు చుట్టూ చదును చేసి ప్లాన్ ప్రకారం చెట్లు, పచ్చటి గడ్డి లాన్ ఏర్పాటు చేయాలన్నారు. చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేయాలని, సందర్శకులకు హోటల్స్, వాకింగ్, సైక్లింగ్‌కు, జీమ్ ఏరియా, చిన్నపిల్లల పార్కు, కాఫీ వర్క్ షాప్, స్విమ్మింగ్ పూల్, ఏర్పాట్లు చేయాలన్నారు. పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫిబ్రవరి లోపల పనులు పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి ఆదేశించారు. అనంతరం కరకంబాడి రోడ్డు, బొంతాలమ్మ గుడి సమీపంలో నిర్మిస్తున్న షాపింగ్‌మాల్ త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మీడియా అడిగిన ప్రశ్నలకు మేయర్, కమిషనర్లు సమాధానమిస్తూ తిరుపతి నగర పాలక సంస్థ కౌన్సిలర్స్ ఏర్పాటైనప్పటి నుండి నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నదని, అందులో రూ.20 కోట్లతో ఫేస్ 1, ఫేస్2 వినాయక సాగర్ పనులు పూర్తి చేస్తున్నామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, కాంట్రాక్టర్లు రాజవేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు వేగవంతం

**- ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లకు కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం**

చిత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త:

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, జల్ జీవన్ మిషన్ నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 488 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు మంజూరు అయ్యాయని, ఇప్పటి వరకు 299 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లో నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు లక్ష్యాలను నిర్దేశించుకొని వేగవంతంగా పూర్తి చేయా లన్నారు. అలాగే జల జీవన్ మిషన్ సంబంధించి 3,76,612 ఇళ్లకు గాను ప్రస్తుతం 20 వేల ఇళ్లకు ఇంటింటికి కొళాయి కనెక్షన్లు ఇవ్వడంజరిగిందన్నారు. జల జీవన్ మిషన్ లక్ష్యాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## ప్రజా సంక్షేమమే సిఎం వైఎస్ జగన్ లక్ష్యం - ఎంపిపి ప్రసాద్‌రెడ్డి

గుడిపాల, జనవరి 7 ప్రభాతవార్త:

ప్రజా సంక్షేమం లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముందడుగు వేస్తున్నారని ఎంపిపి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. 189 రామాపురంలో శనివారం పెరిగిన పెన్షన్లను లబ్ధిదారులకు ఎంపిపి ప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాలకే పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత సిఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులకు 3 వేల రూపాయల వరకు పెన్షన్లు పెంచడం జరుగుతుందన్నారు. జడ్పీవైస్‌ఛైర్మన్ రమ్య, ఎంపిడిఓ ఉపేంద్ర, సర్పంచ్ సోము తదితరులు పాల్గొన్నారు.

## అజ్ఞాతంలో వెళ్లిన టిడిపి నేతలు

కుప్పం, జనవరి 7 ప్రభాతవార్త

తెదేపా అధినేత చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో భాగంగా ఈనెల 4వతేది శాంతిపురం మండల ంలో చోటు చేసుకున్న సంఘటనలపై రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పలువురు దేశం నేతలపై హత్యాయత్నంతో పాటు మరికొన్ని కేసులు నమోదయ్యాయి. శాంతిపురం మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, మహిళా నేతలతో సహా పలువురిపై కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో పోలీసులు అరెస్ట్‌లు చేస్తారని భావించి కేసులు నమోదైన నేతలంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని తెలుస్తోంది.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, జనవరి 7 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తెలంగాణా రాష్ట్రం కొత్తగూడెంకు చెందిన మాధవ అనే భక్తుడు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి చెక్ రూపంలో ఆలయ సూపరెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

## జడ్పీ సీఈఓచే పలు అభివృద్ధి పనులకు పరిశీలన

ఐరాల, జనవరి 7 ప్రభాతవార్త:



మండలంలోని పొలకల గ్రామ పంచాయతీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను చిత్తూరు జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని గూడూరుపల్లె, గూడూరుపల్లె ఎస్సీ వాడ, చల్లావారిపల్లె గ్రామాల్లో డీఎమ్ఎఫ్ గ్రాంట్ నిధులతో నూతనంగా సీసీ రోడ్లు, చామంతిపురం నందు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ జె.ప్రసాద్‌నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

గుడిపాల, జనవరి 7 ప్రభాతవార్త:



కుప్పం పర్యటన ముగించుకొని తిరిగి వెళ్తున్న జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును శుక్రవారం రాత్రి బెంగళూరు విమానాశ్రయంలో మండలానికి చెందిన టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్రఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్తుప్రసాద్ కలిశారు. ముత్తుప్రసాద్‌తో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికలు పార్టీకి ఎంతో కీలకమని ప్రతి ఒక్కరు కష్టపడి పార్టీని గెలిపించడానికి చర్యలు తీసుకోవాలని కోరారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముత్తుప్రసాద్ చంద్రబాబును ఘనంగా సన్మానించారు.

## చట్టవిరుద్ధ కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

**- ఎస్ఐ రాజశేఖర్**

గుడిపాల, జనవరి 7 ప్రభాతవార్త:

సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మండల పరిధిలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్ఐ రాజశేఖర్ స్పష్టం చేశారు. ఈ విషయంపై శనివారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఎద్దుల జల్లికట్టు, కోడి పందెలు, పేకాట ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిసినా వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు.

## సిఎం జగన్‌కు ఓటమి భయం - మాజీ మేయర్ కఠారి హేమలత

చిత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త:

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అప్పుడే ఓటమి భయం పట్టుకొందని మాజీ మేయర్ కఠారి హేమలత పేర్కొన్నారు. తెలుగు మహిళా నాయకులతో కలిసి శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మంత్రి ఆర్‌కె రోజా చంద్రబాబునాయుడు జిల్లాలో పుట్టినందుకు సిగ్గుపడుతున్నామని చెప్పారని, నగరిలో రెండు సార్లు ఓటమి పాలైన రోజా ప్రస్తుతం మాట్లాడుతున్న మాటలకు రాష్ట్ర ప్రజలు సిగ్గు పడుతున్నారని ధ్వజమెత్తారు. తమ నేత చంద్రబాబునాయుడును నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని ఆమె హెచ్చరించారు. సమావేశంలో దేశం మహిళా నేతలు నాగలక్ష్మి, వరలక్ష్మి, రాణి, శ్రీదుర్గ పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు ఉచిత న్యాయసేవలు

**- న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్**

చిత్తూరురూరల్, జనవరి 7 ప్రభాతవార్త:



నిరాశ్రయులకు ఉచిత న్యాయ సేవలందిస్తామని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ పేర్కొన్నారు. శనివారం న్యూ కయనికట్టు వీధిలోని నిరాశ్రయుల వసతిగృహంలో సపోర్టు సంస్థ అధ్యక్షుడు జోసఫ్‌రాజు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్జి కరుణకుమార్ మాట్లాడుతూ నిరాశ్రయులకు న్యాయపరమైన సలహాలు, సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం న్యాయసేవాధికార సంస్థ సహకారంతో నిరాశ్రయులకు మంజూరైన నూతన ఆధార్ కార్డులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ప్రాధమిక ఆరోగ్యకేంద్ర అధికారి డాక్టర్ బాలాజీ, హెల్ సెక్రటరీ కవిత, ఆశావర్కర్ రాధా, వసతిగృహ సిబ్బంది ప్రమీళ, శశిరేఖ, బాబులతో పాలు నిరాశ్రయులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుప్పం, జనవరి 7 ప్రభాతవార్త

కుప్పంలోని 132/33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంలో కుప్పం, గుడుపల్లె మండలాల్లో పలుచోట్ల ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రెస్కో ఎండి సుబ్రమణ్యం, ఎడిఇ ప్రభాకర్ తెలిపారు. గుడ్లనాయనపల్లి, చెక్కునత్తం, కుప్పం, వసనాడు, గుడుపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 3గంటల దాకా విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## ఎంఆర్‌పిఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాలు

కుప్పం, జనవరి 7 ప్రభాతవార్త



మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ కార్యవర్గ సమావేశం ఈనెల 10వతేది బెంగళూరు వసంత్ నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో జరుగుతుందని నేతలు దేవరాజు, మురుగేష్, రవీంద్ర, ప్రకాష్, ఎర్రప్ప, సురేష్, సుబ్బు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ నేతృత్వంలో జరుగుతుందన్నారు. కుప్పం నియోజకవర్గంలోని కార్యకర్తలు అధిక సంఖ్యలో బెంగళూరుకు వచ్చి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

కుప్పంరూరల్, జనవరి 7 ప్రభాతవార్త

కుప్పం పట్టణం మర్రిమాను వీధికి చెందిన తనను మున్సిపల్ గుత్తేదారుడు అయిన నాగరాజు, అతని కుమారుడు అనిల్‌కుమార్‌ల సూచనలతో ఆరుమంది వ్యక్తులు దాడి చేయగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు న్యాయవిద్యార్థి నరేంద్ర పేర్కొన్నాడు. మున్సిపాలిటీ గేటు వసూళ్లలో అక్రమాలు జరుగుతున్నాయని తాను లోకాయుక్తలో పిటీషన్ వేశానన్నారు. అయితే పిటీషన్ వెనక్కు తీసుకోవాలని ఒత్తిళ్లకు గురిచేశారని తాను అంగీకరించకపోగా ఈనెల 5వతేది తాను ప్రధాన రహదారిలో ఉండగా ఆరుగురు మంది వ్యక్తులు వచ్చి తనపై విచక్షణారహితంగా దాడి చేశారని తనకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో కోరాడు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు - ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం, జనవరి 7 ప్రభాతవార్త



అర్హులైన పేదలకు నవరత్నాలు పథకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. శనివారం దుంకుమానిపల్లిలో గడపగడ పకు కార ్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇం టింటా తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. 2024లో ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇస్తే ముఖ్యమంత్రి జగనన్న చొరవతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ భరత్‌కు మహిళలు హారతులు పట్టి స్వాగతంపలికారు. ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, జడ్పీటిసి శ్రీనివాసులు, పట్టాభి, చిన్నప్ప, చెంగప్ప, మురుగేష్, భాస్కర్, చెంగమరాజు, ఎంపిడిఓ హేమమాలిని, వివిధ శాఖల అధికా రులు పాల్గొన్నారు.

## తెదేపానుంచి వైకాపాలో చేరిన మైనార్టీలు

రామకుప్పం, జనవరి 7 ప్రభాతవార్త



మండలంలోని లింగాపురానికి చెందిన మైనార్టీ నేతలు రియాజ్‌బాషా, బషీర్‌సాబ్, ఇస్మాయిల్, అస్మత్‌బాషా తదితరులు తెలుగుదేశం పార్టీ నుంచి వైకాపాలోకి చేరారు. శనివారం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వారు వైకాపాలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. తెదేపా నేతలు ఎన్ని కుట్రలు చేసినా వైకాపా వైపు ప్రజలు, మహిళలు, వృద్ధులు ఉన్నారన్నారు. 2024లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సిఎం జగనన్న చొరవతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి నితిన్‌రెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ రాజగోపాల్, నేతలు యశ్వంత్‌రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**- ఏపి గవర్నమెంట్ డ్రైవర్స్‌అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు**

చిత్తూరురూరల్, జనవరి 7ప్రభాతవార్త:



ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఏపి గవర్నమెంట్ డ్రైవర్స్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎస్. పన్నీర్ సెల్వం పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లి డివిజన్‌కు సంబంధించి ఏపి గవర్నమెంట్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను మదనపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఎంపిక చేసారు. మదనపల్లి డివిజన్ ప్రెసిడెంట్‌గా ఏ. నాగరాజ(ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసరు), జనరల్ సెక్రటరీగా ఎం. క్రిష్ణప్ప(ఎంఎంసి), ట్రెజరర్‌గా టి. మౌలాలి( జ్యుడిషియల్ డిపార్టుమెంట్), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వి. నాగరాజ(ఎంఎంసి), గౌరవ అధ్యక్షులుగా కిరణ్‌బాబు( ఫైర్ ఆఫీసు), డివిజినల్ ఆర్గనైజర్ సెక్రటరీగా ఎస్.అలీ( సిరికల్చర్) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎం. గోవిందు(ఎంఎంసి), ఎం. వేణుగోపాల్(ఎంఎంసి,)లను ఎన్నుకొన్నట్లు పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## తడలో తిరుపతి విద్యాశాఖ అధికారి పర్యటన

తడ, జనవరి 7 ప్రభాతవార్త



తడ సమగ్ర శిక్షా కార్యాలయాన్ని తిరుపతికి చెందిన అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్ శనివారం సందర్శించారు. మండలంలోని నడిమి కుప్పంపాఠశాలలోఆయనపలువురువిద్యాశాఖ సిబ్బందితో మాట్లాడారు. ప్రధానమంత్రి ఫర్ రైజింగ్ ఇండియాలో ఎంపికైన నడిమికుప్పం ప్రాథమిక పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచమని ఆదేశించారు. మండల విద్యాశాఖ కార్యాలయానికి వచ్చి బైజూస్ ట్యాబ్‌ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఏ-1 పరీక్షను ప్రత్యక్షంగా చూశారు. కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్, డేటాఎంట్రీ ఆపరేటర్ పాల్గొన్నారు.

## కోడి పందేలపై ఉక్కుపాదం : సిఐ

ఓజిలి, జనవరి 7 ప్రభాతవార్త



ఓజిలి మండల పరిధిలోని గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ కోడి పందేలు వేసినా, చూసినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఓజిలి మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట వంటి జూదాలు, కోడి కత్తులు తయారు చేయడం లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై బెండోవర్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కోడిపందేలు, జూదం నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పేదలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**- కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్**

ఓజిలి, జనవరి 7 ప్రభాతవార్త

ఉన్నదంతా కార్పొరేటర్లకు దోచిపెడుతూ, పేదలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. ఓజిలి మండలం కుందాం, మాచవరం, ముమ్మాయిపాలెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాడి వెంకటయ్య ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అధ్యక్షతన జోడో యాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోవడంతో వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఇందిరాగాంధీ పేదలను ఆదుకునేందుకు గరీబీ హఠావో పేరుతో పేదలకు భూములిస్తే, ప్రస్తుతం ఈ భూములను సంపన్నులకు దోచిపెట్టడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వాకాడులో ఇదేమి కర్మ

వాకాడు, జనవరి 7, ప్రభాతవార్త

వాకాడులోని శనివారం బీసీ కాలనీలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పరిపాలన పై ఇదేమి కర్మ కార్యక్రమంను నిర్వహించారు. బిసి కాలనీలోని ఇంటి ఇంటికి మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్‌తో పాటు జిల్లా ఇంచార్జి నరసింహయాదవ్, గూడూరు ఇంచార్జి కరీముల్లా, వాకాడు మండలం టిడిపి నాయకులు తిరిగారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలో టిడిపికి ఓటు వేసి గెలిపించండి అని మహిళలను, ప్రజలను కోరారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చేస్తున్న అరసాకాలు ప్రజలు గమనించగలరని తెలిపారు. జీవో 1ను వెంటనే రద్దు చేయాలన్నారు. వాకాడులోని సభ్యత్వం కోసం ప్రజలు ముందుకు అభినందనీయమన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**- తిరుపతి జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి**

కోట, జనవరి 7 ప్రభాతవార్త

స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో శనివారం తిరుపతి జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి జయలక్ష్మి ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లుల్లో రక్తహీనత తగ్గడం, బరువు తక్కువ పిల్లలను గుర్తించి వారికి పోషకాహారం అందిస్తారన్నారు. గర్భిణులకు, బాలింతలకు, ఆరేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించేపోషకాహారాన్నివివరించారు. ఈ సమావేశంలో సిడిపిఓ జ్యోతి, సూపర్‌వైజర్లు కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9న స్పెషల్ గ్రీవెన్స్‌డే

కోట, జనవరి 7 ప్రభాతవార్త

ఈ నెల 9న కోటలోని రెవెన్యూ కార్యాలయంలో స్పెషల్ గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు కోట తహశీల్దార్ పద్మావతి చెప్పారు. శనివారం ఆమె 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ రెవెన్యూపరంగా ఉన్న సమస్యలను ఈ గ్రీవెన్స్‌డేలో చెప్పుకోవచ్చని తెలిపారు. ఈ గ్రీవెన్స్‌డేఆర్డీఓ కిరణ్‌కుమార్ వస్తారని పేర్కొన్నారు.

# వైసీపీ పాలనలో అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు

**- పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**





ఓజిలి, జనవరి 7 ప్రభాతవార్త

వైసీపీ ప్రభుత్వం పాలనలో అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు కనిపిస్తున్నాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం ఓజిలి మండలంలోని గిరిజన కాలనీ, బీసీ కాలనీలో వైసీపీ నాయకులు ముమ్మడి సుబ్బారావు యాదవ్, బట్టా పృథ్వీకృష్ణ యాదవ్, బట్టా అనిల్‌కుమార్ యాదవ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓజిలి మండలానికి సంబంధించి అర్హులైన 166 మంది‌కి కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైసీపీ నాయకులు ముమ్మడి సుబ్బారావు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా అర్హులకు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే రాచపాలెం గ్రామంలో కోఆప్షన్ సభ్యులు, యువ నాయకులు షేక్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యే సంజీవయ్యకు భారీ గజమాలతో, డప్పు, మంగళ వాయిద్యాలు, కర్పూర హారతులతో మహిళలు, కాలనీవాసులు, వైసీపీ నాయకులు కొండూరు దామోదర్‌రాజు, ముస్లిం మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు జానీబాషా, సర్పంచ్ ముప్పాళ్ల శారదమ్మ తదితరులు స్వాగతం పలికారు. అందరూ కలిసి వీధివీధికి గడప గడపకు, ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలకడంతో పాటు పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు, ముమ్మడి సుబ్బారావుయాదవ్, తహసీల్దార్ డి.లాజరస్, ఎంపిడిఓ రజనీకాంత్, నాయుడుపేట సిఐ వైవి సోమయ్య, బట్టా బ్రదర్స్ అనిల్‌కుమార్ యాదవ్, పృథ్వీకృష్ణ యాదవ్, ఎస్ఐ సి.కృష్ణారెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ గోవిందయ్య, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, పాదర్తి హరినాథరెడ్డి, దామోదర్‌రాజు, ముమ్మడి జయరామయ్య, పండ్లూరు వేణు, పంజాప్రతాప్, ఫణిందర్‌రెడ్డి, వై.ధనంజయరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్, వెలుగు ఎపిఎం నిర్మలమ్మ, ఒట్టూరు కిషోర్ యాదవ్, నవీన్, షేక్ జానీబాషా, వేణురెడ్డి, రాజారెడ్డి, ఎఎంసి డైరెక్టర్ బట్టికాయల కృష్ణయ్య, కొండూరు వెంకటసుబ్బరాజు, కాకాణి రవి, మహిళలు, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా రవాణా సంస్థలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు ఉద్యోగ నియామకాలు



చిత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త: గతంలో ప్రజా రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు శనివారం కలెక్టర్ హరినారాయణన్ ఉద్యోగ నియామకాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడుతూ వృత్తికి గౌరవం తీసుకువచ్చేలా విధులు నిర్వర్తించాలని కోరారు. గతంలో ప్రజా రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు 42 మందికి ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇస్తామని సిఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారి కుటుంబాల్లోని 42 మందికి ప్రస్తుతం నియామక ఉత్తర్వులు అందించడం జరిగిందన్నారు. ఇందులో విఆర్ఓ గ్రేడ్-2గా 11 మంది, గ్రామ సర్వేయర్లుగా ఇద్దరు, ఆఫీస్ సబార్డినేట్లుగా 13 మంది, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లుగా 8 మంది, పంచాయతీ కార్యదర్శులుగా 8 మందిని నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

## గుండ్లపల్లెలో ఉచిత వైద్యశిబిరం

ఐరాల, జనవరి 7 ప్రభాతవార్త:



మండలంలోని గుండ్లపల్లె హెల్త్‌సెంటర్‌లో మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మండల వైద్యాధికారి డాక్టర్ కెవి.పూర్ణలత ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్ పరిధిలో 104 ద్వారా ఉచిత వైద్య సేలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూర్ణలత మాట్లాడుతూ 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎం విమల, ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ లైన్‌మేన్...! -కుమార్తె సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు

చౌడేపల్లి, జనవరి 7 ప్రభాతవార్త

రాత్రి అందరూ భోజనానికి ఉపకరిస్తున్న సమయంలో స్థానిక సంతగేటు వద్దగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద శబ్దం వచ్చి సరఫరా ఆగిపోయింది. దీంతో పంచాయతీ కార్యాలయం, బజారువీధి, సంతగేటువీధి తదితర ప్రాంతాల్లో అంధకారమైంది. స్థానికుల నుంచి సమాచారమందుకొన్న ట్రాన్స్‌కో లైన్‌మేన్ పొలకల సుబ్రమణ్యం ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకొన్నాడు. అయితే ఆ సమయంలో సహాయకులెవ్వరూ అందుబాటులో లేకపోవడంతో తన కుమార్తె సహకారం తీసుకొన్నాడు. చిన్నారి టార్చ్‌లైట్ వేసుకొని తండ్రికి సాయపడుతుంటే లైన్‌మేన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మత్తు చేసి విద్యుత్ సరఫరా సజావుగా వుండేలా చర్యలు తీసుకొన్నాడు. గతంలో మరమ్మత్తుకు గురైతే రాత్రంతా ఇబ్బందులు పడేవారమనీ, అయితే అర్థగంటలో మరమ్మత్తు చేసి విద్యుత్ సరఫరానందించిన లైన్‌మేన్ సుబ్రమణ్యం అతని కుమార్తెను స్థానికులు అభినందించారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**- సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి**

వెంకటగిరి, జనవరి 7, ప్రభాతవార్త:



కార్మికుల హక్కులను కేంద్రీయ రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంపుదల విషయంలో గాని, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయడంలో ఏఐటటీయుసి ముందుండి ఉద్యమిస్తుందన్నారు. కార్మికులకు అండగా ఏఐటీయుసి ఎల్లవేళలా ఉంటుందన్నారు. నీతి నిజాయితీగా కార్మికుల కోసం ఉద్యమిస్తున్నటువంటి ఏఐటీయుసీకి సిపిఐ అండగా ఉంటుందన్నారు. స్థానికంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కాలం నుంచి పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నటువంటి వల్లూరు ఇందిరమ్మను వెంటనే ఆప్కాస్‌లోకి ఎక్కించాలన్నారు. పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలకృష్ణయ్య, వెంకటగిరి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య, పట్టణ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. గౌరవ అధ్యక్షులుగా వడ్డిపల్లి చెంగయ్య, అధ్యక్షులుగా పరమాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా సాలా పక్షిప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎస్.గోపాల్, పి.మణి, ఇలగనూరు శ్రీనివాసులు, పి.లక్ష్మి, పి.రమణయ్య, సహాయ కార్యదర్శులుగా సిద్ధు మోహన్, ఆర్.సాయికృష్ణ, కె.సుబ్బరత్నమ్మ, టి.సుబ్బయ్య, ఆర్.ఆదిలక్ష్మి, కమిటీ సభ్యులుగా వి.ఇందిరమ్మ, కోశాధికారిగా వల్లూరు పెంచలయ్యలు ఎన్నికయ్యారు.

# స్మశానవాటికలను పరిశుభ్రంగా ఉంచండి

**కమిషనర్ అనుపమ అంజలి**

తిరుపతి కార్పొరేషన్, జనవరి 7, ప్రభాతవార్త



నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డుల్లో గల స్మశాన వాటికల్లో పారిశుధ్య పనులు చేసి పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని 39వ వార్డులో గల వివేకానంద కూడలి, జర్నలిస్ట్ కాలనీ, చెన్నారెడ్డి కాలనీ, అంబేద్కర్ కాలనీ, మారుతి నగర్‌లో పారిశుధ్య పనులను శనివారం ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి కమిషనర్ పరిశీలించారు. చెన్నారెడ్డి కాలనీలోకి కోనేరును పరిశీలించి కోనేరును శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. కోనేరు చుట్టూ పూల మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. చెత్త తీసుకెళ్లే వాహనం ప్రతి రోజు వస్తోందా ? కాలువలు శుభ్రం చేస్తున్నారా ? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న శ్మశాన వాటికను పరిశీలించారు. అంతా చెత్త నిండి ఉండడంతో స్మశానవాటికల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తైన దహనక్రియల వాటికను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, సానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, ఇన్స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

## ఏం కొనే పరిస్థితిలేదు..ఏం తినే పరిస్థితి లేదు..

-వైకాపా పాలనలో సామాన్యుడి తిప్పలు

శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త



నేటి వైకాపా ప్రభుత్వంలో సామాన్యమానవుడు ఏం కొనే పరిస్థితి, ఏం తినే పరిస్థితి లేదని పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని పట్టణంలోని 28వ వార్డులో ఇన్‌ఛార్జి భాస్కర్‌గౌడ్, గంగిరెడ్డి, ఆనంద్‌ల ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ వార్డులో ప్రతి ఇంటికి వెళుతూ వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువులు, విద్యుత్ బిల్లులు, ఇసుక, ఇంటిపన్నులు తదితర విషయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వార్డు ప్రజలు వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని విధాలుగా నష్టపోయామని చివరికి అర్హత ఉన్న పెన్షన్లు, రేషన్‌కార్డులు కూడా తీసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఉమేష్‌రావు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), మాజీ మున్సిపల్ ఛైర్మన్ మిన్నల్‌రవి, ప్రసాద్‌రావు, మునిరాజయాదవ్, ప్రతాప్, దిలీప్‌కుమార్, కోబాకలక్ష్మణ్, మురళీ, దొరబాబు, సాయి, కాసరం రమేష్, కిషోర్, గౌతంరెడ్డి, యాదగిరి, మణి, శివ, సురేష్‌నాయుడు, శ్రీలక్ష్మి, మునికృష్ణ, ఖాదర్‌బాషా, హేమంత్, సూరి, సుబ్రమణ్యం మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు 28వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అన్నదాతలకు యూరియాను అందుబాటులోకి తీసుకురావాలి

శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త

అన్నదాతలకు యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు ప్రకాష్‌నాయుడు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా, పొటాష్, పాస్పరస్ వంటి ఎరువులు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేడ, దిబ్బ ఎరువులు ఎంత వాడినా రసాయనిక ఎరువులు వాడకుంటే పంట దిగుబడి గణనీయంగా తగ్గి రైతులు అపార నష్టాన్ని చవిచూస్తున్నారని వాపోయారు.

## పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిపంపిణి

శ్రీకాళహస్తిరూరల్,జనవరి 7ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని బివిపురం, ముచ్చివోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో క్రీడా సామగ్రిని అందించారు. శనివారంప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ మాట్లాడుతూ పిల్లల శారీరక,మానసిక వికాశానికి ఎపెంపొందించేకార్యక్రమంలో భాగంగా యువ క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందించినట్లు వివరించారు. ప్రగతి సంస్థ సారధ్యంలో క్రై బెంగుళూరు సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల కో ఆర్డినేటర్ రామచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఎంసి కమిటి ఛైర్మెన్ గురునాథరెడ్డి, ప్రధానోపాధ్యాయులు గోపి, వెంకటరమేష్,ఉపాధ్యాయులు ప్రగతి సిబ్బంది శివారెడ్డి,పూర్వపు విద్యార్థులు, ఎస్సివి లీడర్లు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టిటిడిలో వ్యాపార ధోరణి తగదు..ఉమేష్‌రావు

శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త



ప్రపంచంలోనే ప్రముఖ హిందూ దేవాలయంగా భక్తుల చేత పవిత్రపూజలు అందుకుంటూ భక్తుల పాలిట కొంగు బంగారంగా, కలియుగ దైవంగా కొలవబడుతూ తిరుమలలో వెలసి ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి తీసుకుంటున్న నిర్ణయాలు ధార్మికతను పక్కన పెట్టి వ్యాపార దోరణిని పెంచుకుంటూ పోతుండడం భక్తులకు తీవ్ర విచారాన్ని కలిగించిందని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. తమ మొక్కులు తీర్చుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు విడిది మరియు భోజన వసతిని అందుబాటు ధరలలో ఏర్పాటు చేయడం తమ ప్రథమ ప్రాధాన్యతగా సేవలు అందించాల్సిన టిటిడి వంటి ధార్మిక సంస్థలు వసతిసౌకర్యాలుసామాన్యభక్తులకుఅందనంతఎత్తులోధరలనుపెంచడం తగదని ఉమేష్ హితవు పలికారు.

## రోజా గారూ..నోరు అదుపులో పెట్టుకో!

శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త

నేడు వైకాపాలో మంత్రిగా కొనసాగుతున్న రోజా రెడ్డికి రాజకీయ బిక్షపెట్టింది ఎవరో మరిపోయావని జగన్ మెప్పుకోసం రాజకీయ బిక్షపెట్టిన మహోన్నత వ్యక్తి నారాచంద్రబాబునాయుడుపై పరుషపద జాలంతో విమర్శలు చేస్తున్నారని మంత్రి అనే విషయం కూడా మరచినట్లు ప్రతిపక్షనేతలపై విమర్శలు చేసేటపుడు ఒళ్ళు దగ్గరపెట్టుకుని మాట్లాడని తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కుప్పం నియోజక వర్గంను అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబునాయుడుదే అని ఆవిషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. చంద్రబాబునా యుడు సభలకు వచ్చే జనసందోహానికి ఓర్వలేక జగన్ సర్కారు చీకటి జీవో.1ని తెచ్చిందన్నారు. ఈ జీవోను చంద్రబాబు ఉల్లంఘించారని రోజా చేస్తున్న విమర్శల్లో పసలేదన్నారు. మంత్రి హోదాలో ఉన్న రోజా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.



## మీ నాయకత్వంలో ఉన్నతసేవలు

త్యాగరాజమండపం ట్రస్టుబోర్డు సభ్యుడుగా బీమాస్ అశోక్

తిరుపతి,జనవరి 7ప్రభాతవార్త:

త్యాగరాజమండపం ట్రస్టుబోర్డు సభ్యుడుగా బీమాస్ అశోక్ ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, సభ్యులు సుబ్రమణ్యం యాదవ్, కెఎన్ రాజా, సుబ్రమణ్యంరెడ్డి అశోక్‌ను అభినందించారు. అనంతరం దుశ్శాలువ కప్పి శ్రీవారి చిత్రపటం, క్యాలండర్ బహుకరించారు.

## ఘనంగా ఫ్యూచర్ ఆన్ ఫ్రీ,గ్లోబల్ ఐకాన్స్ స్కూల్ వార్షికోత్సవం

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 7 ప్రభాతవార్త:

శనివారం రాత్రి స్థానిక మహతి కళాక్షేత్రం నందు ఫ్యూచర్ ఆన్ ఫ్రీ స్కూల్, గ్లోబల్ ఐకాన్స్ స్కూల్ 4వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 'తెలుగు భాషోద్యమ సమితి' అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి హాజరయ్యి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య ప్రతి విద్యార్థి ఉన్నతికి సోపానమని, ఆ దిశగా విద్యాబోధన సాగించి పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా యూకేజీ పూర్తిచేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందచేశారు. దేశభక్తినిచాటేగీతాలతో చిన్నారులు ప్రదర్శించిననృత్యాభినయనాలు, నాటికలు అబ్బురపరిచా యి. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్‌కుమార్, అసోసియేట్ డైరెక్టర్లు రాకేష్, శశిరేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆస్పత్రికి మూడు వీల్‌చైర్‌లు వితరణ

నగరి, జనవరి 7 ప్రభాతవార్త:

పట్టణ పరిధిలోని సిరిడ్స్ బుద్ధిమాంద్యగతల పిల్లల పాఠశాల సంస్థ నిర్వాహకురాలు గిరిజ స్థానిక ఏరియా ఆస్పత్రికి మూడు వీల్‌ఛైర్‌లు ఉచితంగా అందించారు. శనివారం ఆస్పత్రికి విచ్చేసిన ఆమె ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్‌కు వాటిని అందజేశారు. ఆస్పత్రికి సాయం అందించడంఎందరికోఉపయోగపడగల సాయమని మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు. ఆర్ఎంవో డా. గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ, ఫార్మాసిస్ట్ అరుణ్, ఆడియోలజిస్ట్ నవీన్‌కుమార్, ఆడియోమెట్రిషన్‌సిద్ధయ్య, బయోమెడికల్ ఇంజనీర్ నీరజ, హెడ్ నర్సులు అముద, శశికల పాల్గొన్నారు.

## తిరుచానూరు విద్యార్థినికి...ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ ఉపకార వేతనం

- విద్యార్థిని దేవిశ్రీకి చెక్కును అందజేసిన ఎంపిపి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, జనవరి 07 ప్రభాతవార్త:



తిరుచానూరు జడ్పి హైస్కూల్లో పదోవతరగతి చదువుతున్న విద్యార్థిని దేవిశ్రీకి ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ మంజూరు చేసిన ఉపకార వేతనం చెక్కును తిరుపతిరూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందజేసారు. శనివారం ఎంపిడిఓ కార్యాలయంలో దేవిశ్రీ తల్లిదండ్రులతో కలిసి చెక్కును అందుకున్నారు. ఉపకార వేతనంకు అర్హత సాధించిన దేవిశ్రీని ఎంపిపి మోహిత్‌రెడ్డి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఊజ్వల భవిష్యత్ కోసం అమ్మఒడి, విద్యా కానుక వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ స్కూల్స్ కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతుందన్నారు. దేవి శ్రీ తల్లి గృహిణి, తండ్రి ఆటో డ్రైవర్‌గా ఉన్నాడని, ఉపకార వేతనం ఆమె ఉన్నత విద్యకు దోహదపడుతుందని తెలిపారు. ఎంపిడిఓ వెంకటనారాయణ, ఏఓ పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గసముద్రంలో 'ఇదేం ఖర్మ-మన రాష్ట్రానికి'

తిరుపతిరూరల్, జనవరి 07 ప్రభాతవార్త:

'ఇదేమి ఖర్మ-మన రాష్ట్రాకి' కార్యక్రమం శనివారం దుర్గసముద్రం గ్రామ పంచాయతీలలో నిర్వహించారు. తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దిక్కుమాలిన చీకటి జీవోలను తీసుకొచ్చి ప్రతిపక్షాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. దుర్గసముద్రం గ్రామ పంచాయతీలలో ఇంటింటికి వెళ్ళి ప్రస్తుత వైకాపా ప్రభుత్వ పాలన అభివృద్ధి ఎలా ఉందో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ చార్జీలు, కరెంట్ చార్జీలు, బస్సు చార్జీలు అమాంతంగా పెరిగి పేదలు మోయలేని విధంగా పెంచారని ప్రజలు వాపోతున్నట్లు తెలిపారు. టిడిపి శ్రేణులు క్రిష్ణమూర్తిరెడ్డి, మునిశేఖర్, ప్రహల్లాదరెడ్డి, వెంకటమునిరెడ్డి, గోఫి, చంద్రశేఖర్, కె.ఎన్.బాబురాయల్, శంకర్‌చెంద న్‌రెడ్డి, మొగిలయ్య, నాగరాజు, గంగయ్య, మురగయ్య, దుర్గసముద్రం ప్రజలు పాల్గొన్నారు.

## శ్మశాన స్థలం ఆక్రమణ - గ్రామస్థులు ఆందోళన

వడమాలపేట, జనవరి 7 ప్రభాతవార్త:

మండలంలోని బాలినాయుడు కండ్రిగ గ్రామంలో శ్మశానస్థలాన్ని ఆక్రమించుకోవడంతో గ్రామస్థులు ఆందోళన చేస్తున్నారు. తిరుపతి-కుప్పం, బాదూరు రోడ్డుకు సమీపంలో బాలినాయుడు కండ్రిగ రెవెన్యూ సర్వే నెం.129లో 97 సెంట్ల పొరంబోకు స్థలాన్ని శ్మశానంగా గ్రామస్థులు ఉపయోగించుకుంటున్నారు. అయితే స్థలం మాదేనంటూ ఆక్రమణదారుడు ఏకంగా మామిడి మొక్కలు నాటారు. గ్రామస్థులు ఎన్నో పర్యాయాలు రెవెన్యూ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బాలినాయుడు కండ్రిగలో సుమారుగా వంద కుటుంబాలు నివాసం ఉంటున్నారు. గ్రామంలో ఎవరు మృతి చెందినా ఇదే స్థలంలోపూడ్చడం, దహనం చేయడం పెద్దల కాలం నుంచి వస్తున్నదని గ్రామస్థులు వాపోతున్నారు. మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న శ్మశాన స్థలం ప్రభుత్వ పొరంబోకు స్థలంగా రికార్డుల్లో ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆక్రమించిన శ్మశాన స్థలాన్ని సర్వే చేసి గ్రామానికి అప్పగించాలని బాలినాయుడు కండ్రిగ గ్రామస్థులు కోరుతున్నారు.

## సమాజానికి నూతన ఆవిష్కరణలు అందించండి

ప్రొఫెసర్ డాక్టర్ రఘురామరాజు

రామచంద్రాపురం, జనవరి 7 ప్రభాతవార్త:

ఫార్మా విద్యార్థులు సమాజానికి నూతన ఆవిష్కరణలు అందించాలని తిరుపతి ఐఐటి కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రఘురామరాజు అన్నారు. శనివారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కాశాలలో అంకుర ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబుతో కలసి జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చగలదన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయ సాధనకై కష్టపడి చదవాలన్నారు. కళాశాలలో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులనువిశేషంగాఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ యం.సుమలత, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జల్లికట్టు నిర్వహణ చట్టరీత్యా నేరం సిఐ ఓబులేష్

రామచంద్రాపురం, జనవరి 7 ప్రభాతవార్త:

జల్లికట్టు నిర్వహణ చట్టరీత్యా నేరమని సిఐ ఓబులేష్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జల్లికట్టు నిర్వహకులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్లికట్టు, కోడిపందేలు, జూదం వంటి పోటీలను ప్రభుత్వం నిషేధించినట్లు తెలిపారు. అనధికారికంగా ఎవరైనా ఇటువంటి పోటీల నిర్వహణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు గిరిబాబు, వంశీధర్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు రెవెన్యూ గ్రామ అధికారుల సంఘం ఎన్నికలు

సంఘం చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాలాజీ రెడ్డి

తిరుపతి రూరల్, జనవరి 7 ప్రభాతవార్త:

తిరుపతి-చంద్రగిరి జాతీయ రహదారి బాలాజీ డైయిరీ ఎదురుగా గల జిఆర్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు సంఘం చిత్తూరు ఉమ్మడిజిల్లాఅధ్యక్షుడుబాలాజీ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూఅధికారులసంఘంఅధ్యక్షుడుభూపతిరాజురవీంద్రరాజుఅధ్యక్షతనఈఎన్నికలుజరుగుతాయని అన్నారు.

## ఎంపీడీవోగా వెంకటరత్నమ్మ

రేణిగుంట, జనవరి 7 ప్రభాతవార్త:

రేణిగుంట ఎంపీడీవోగా వెంకటరత్నమ్మ తాత్కాలిక అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీడీవో (ఎఫ్ఏసీ) హరిబాబు ఈ నెల 6 నుంచి 20 తేదీ వరకు సెలవుపై వెళుతున్నారని, అప్పటి వరకు ఈవోపీఆర్‌డీగా ఉన్న వెంకటరత్నమ్మ తాత్కాలిక ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు తీసుకున్నారు.

## భూమిని అమ్మిన వారే కాజేయాలని చూస్తున్నారు

-న్యాయం చేయాలని అధికారులకు పద్మావతమ్మ వేడుకోలు

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 7 ప్రభాతవార్త:

మాకు భూమిని అమ్మిన వారే కాజేయాలని చూస్తున్నారని తిరుపతి సప్తగిరినగర్‌కు చెందిన కోట పద్మావతమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ మంగళం పరిధిలోని చెన్నాయిగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబర్ 134/19లో 10 సెంట్లు,134/20లో 10 సెంట్లుతో కలిపి మొత్తం 20 సెంట్ల భూమిని 1986లో పరమాల సిద్ధయ్య,పరమాల రంగయ్య,చంటయ్య,పెద్ద చెంచయ్యల నుండి కొనుగోలు చేసి 5940/1986గా రిజిస్ట్రేషన్ చేయించుకున్నానన్నారు. నా భర్త కోట గోవిందరాజులు 2013 ఫిబ్రవరి 20వ తేదీ మరణించడంతో అదే ఏడాది నవంబర్‌లో మాకు భూమిని విక్రయించిన పరమాల సిద్ధయ్య చిన్న కుమారుడు పరమాల మణి పేరుపై పరమాల రంగయ్య 10 సెంట్ల భూమిని 5761/2013గా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వాపోయారు. మా భూమిపై జరిగిన రిజిస్ట్రేషన్ రద్దుచేసి,అలాగే పిటిఆర్‌ను కూడా రద్దు చేయాలని అధికారులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

## దాతృత్వం చాటుకున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి

తిరుచానూరు,జనవరి 7 ప్రభాతవార్త:

తిరుచానూరు పంచాయితీ దామినేడుకు చెందిన బి.ఉమేష్‌చంద్ర నాయక్ అనే విద్యార్థికి 50 వేల రూ॥ల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి అందచేశారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూయూనివర్సిటీలో చదువుతున్న ఉమేష్ చంద్రకు అతని తల్లిదండ్రులు కొనిచ్చే ఆర్థిక స్తోమత లేకపోవడంతో విషయంతెలుసుకున్నరామచంద్రారెడ్డిఅతనికిల్యాప్‌టాప్‌కొనిచ్చితనదాతృత్వాన్నిచాటుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఉమేష్ చంద్ర లాగా ప్రతి విద్యార్థి విద్యలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని, అలాంటి పేద విద్యార్థులకు సాయమందించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు.

## గృహాల మధ్య చక్కగా వీధులు ఏర్పాటు చేయండి

కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్, జనవరి 7, ప్రభాతవార్త

జగనన్న లేఔట్‌లలో నిర్మిస్తున్న జగనన్న గృహాల మధ్యలో చక్కగా వీధులు ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. చంద్రగిరి మండలం కొత్తపల్లిలోని జగనన్న లేఔట్‌ను శనివారం ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాల్లో మరింత వేగం పెంచాలన్నారు. అలాగే గృహాల మధ్య వీధులు స్పష్టంగా ఉండేలా గ్రావెల్ తొలి చదును చేయాలన్నారు. కమిషనర్ వెంట డిఈలు సంజయ్ కుమార్, మోహన్, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

## వరదరాజస్వామి ఆలయానికి కొత్త రాళ్ళు ఉపయోగించండి

-స్థపతికి ఛైర్మెన్ వినతి

శ్రీకాళహస్తి,జనవరి 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయం పునర్నిర్మాణంలో పురాతన కాలం నాటి రాళ్ళు స్థితి కొల్పోయాయని కొత్త రాళ్ళను ఉపయోగించాలన్న ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అభ్యర్థనను రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప అంగీకరించారు. శనివారం రాష్ట్రదేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప పలు పరిశీలనలు జరిపారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న ఏడు గంగమ్మల ఆలయాన్ని, ప్రసన్నవరదరాజస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఏడుగంగమ్మ ఆలయాన్ని పరిశీలించినపుడు ఇక్కడ ఆలయ అభివృద్ధికి సంబంధించి పోలసామి స్వర్ణమూర్తి వివరించారు. ఈ పరిశీలనల్లో స్థపతితో పాటు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ డిఇలు మురళీధర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎఇలు వేణుగోపాల్,పవన్, స్థపతి కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ సూర్యప్రసాద్, వైకాపా నాయకులు స్వర్ణమూర్తి, శేఖర్, గణేష్, పులిరామచంద్రయ్య, రవి,,ఉదయ్‌కుమార్, నరసింహులు తదితరులుపాల్గొన్నారు

## ఫ్రైడే డ్రైడేను తప్పక పాటిస్తేనే వ్యాధుల నివారణ -ప్రజలకు అవగాహన

తొట్టంబేడు, జనవరి 7 ప్రభాతవార్త

ఫ్రైడే డ్రైడేను తప్పకపాటిస్తేనే వ్యాధులను నివారించవచ్చని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య కార్యకర్త కామరాజు తెలిపారు. మండలంలోని తెలుగుగంగ కాలువ సమీపంలోని మారిముత్తు క్వారీ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల్లో దోమల వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే డ్రైడేని జరుపుకుంటున్నామన్నారు. క్వారీ ప్రాంతంలో ఇంటింటికి తిరిగి దోమల వ్యాధుల నివారణ, దోమల లార్వా వాటి పుట్టుక, అభివృద్ధి గురించి తెలియజేశారు. నేరుగా గృహస్తులకు లార్వాను చూపించి నిర్మూలన కార్యక్రమాలు ఎలా అన్నది వివరించారు. ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని గ్రామాల సచివాలయాల పరిధిలో శుక్ర మరియు శనివారాల్లో వందశాతం జరిగేలా వైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం వరలక్ష్మి, ఆశావర్కర్ భారతీ తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడులో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం

తొట్టంబేడు, జనవరి 7 ప్రభాతవార్త

ఎంఎల్‌సి ఎన్నికల్లో వైఎస్ఆర్‌సిపి తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఆదేశాలతో తొట్టంబేడు మండల ఇన్‌ఛార్జి బియ్యపుపవిత్రారెడ్డి సూచనలతో శనివారం సాంబయ్యాపాళెం సచివాలయం, తొట్టంబేడు 1,2 సచివాలయాలు, బసవయ్యాపాళెం సచివాలయ పరిధిలోని గ్రామాల్లో వైఎస్ఆర్‌సిపి ఎంఎల్ఏసి మండల ఇన్‌ఛార్జి కరపత్రాలు అందజేస్తూ పట్టభద్రులను కలిసి కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు మదన్మోహన్, తొట్టంబేడు సర్పంచ్ సుబ్బయ్య, మాజీ సర్పంచ్ భాస్కరయ్య, వెంకీ, సూరజ్ మండల ఎంఎల్‌సి ఇన్‌ఛార్జి కేతినేని వెంగళరావు, అశోక్, తీర్ధరామన్, రాజశేఖర్, కిరణ్ మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గేట్‌పుత్తూరు రైల్వే సమస్యలు పరిష్కరించండి

పుత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త :



పట్టణంలోని గేట్‌పుత్తూరుకు సంబంధించిన రైల్వే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి పోతుగుంట విజయ్‌బాబు శనివారం చెన్నైలోని దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ సచిన్ పునేతాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేట్‌పుత్తూరు నుంచి పుత్తూరు పట్టణంలోకి రాకపోకలు సాగించేందుకు ప్రజలు ద్రౌపది దేవి గుడి వద్ద వున్న రైల్వే ట్రాక్ మార్గాన్ని ఏళ్ల తరబడి వినియోగిస్తున్నారని ఈ నేపథ్యంలో ఇటీవల రైల్వే శాఖాధికారులు ఈ మార్గాన్ని మూసివేశారని తెలిపారు. దీని వల్ల విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని లేదా వున్న మార్గాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. అలాగే కామరాజ్‌నగర్‌లో స్థానికులను ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇచ్చారని, జాయింట్ సర్వే నిర్వహించేంత వరకూ ఇక్కడ స్థలాలను ఖాళీ చేయించడం సమంజసం కాదని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఇ.రవినాయుడు, నాయకులు ధనపాల్, శంకర్, నికేష్ వున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే జరిమానాలు తప్పవు : ఎస్ఐ

నారాయణవనం, జనవరి 7 ప్రభాతవార్త :

పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలో నడిచే వాహనాలకు సంబంధించి రవాణా శాఖకు సంబంధించి అన్ని రికార్డులను పెట్టుకొని నడపాలని లేకపోతే జరిమానాలు తప్పవని స్థానిక ఎస్ఐ ఎం.పరమేష్‌నాయక్‌లు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద రహదారిపై నడిచే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, స్కూటర్‌లో ఇద్దరు మాత్రమే ప్రయాణించాలన్నారు. అతి వేగం ప్రమాదమన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

## టిటిడి ఆలయంలో ప్రారంభమైన ఆండాల్ అమ్మవారి ఉత్సవం

నారాయణవనం, జనవరి 7 ప్రభాతవార్త :



నారాయణవనంలో ప్రసిద్ది చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో వెలసిన ఆండాల్ అమ్మ వారి ఆలయంలో శనివారం నుంచి ఉత్సవాలు ప్రారం భమైనది. టిటిడి ఆద్వర్యంలో ఈ ఉత్సవాలను ఏడురోజుల పాటు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు. ఉత్సవాల్లో మొదటి రోజు శనివారం ఉదయం అమ్మవారి ఆలయంలో శుద్ధి, నిత్యపూజాకార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అమ్మవారిని తిరుప్పావై ప్రవచనంతో మేల్కొల్పారు. అనంతరం అభిషేకం చేసిన తర్వాత వివిధ రకాలపుష్పాలతోసుమనోరంగంఅలంకరించారు. అనంతరంఅమ్మవారినిఉదయం6గంటలకు తిరుచ్చివాహనంపై అధిరోహించిన తర్వాత పురవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు.

## అంగన్‌వాడి, ఆశలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఏఐటీయూసీ



నగరి, జనవరి 7 ప్రభాతవార్త:

అంగన్‌వాడీ, ఆశలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి జీతాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. శనివారం స్కీం వర్కర్స్ ఆశ, అంగన్‌వాడీ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కోదండయ్య పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోపూర్తిగా విఫలమైందని, మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంలో జీతాలు పెంచడంలోను నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు అనేక యాప్ డౌన్‌లోడ్ చేసి ఉదయం నుంచి రాత్రి 12 వరకు కూడా పనులు చేసుకునే పరిస్థితుల్లో మహిళా కార్మికులు ఉన్నారు. సర్వర్లు పని చేయకుండా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాంటి వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సరి సమానంగా ఫేస్ రికగ్నైజేషన్ అమలపరచాలనుకోవడం మహిళా కార్మికులను మోసం చేయడమే అవుతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తూ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు వహిస్తున్న సూర్య ప్రభా పదవీ విరమణ పొందిన సందర్భంగా నగరి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. సమావేశంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు వేలన్ బాషా, రాజేంద్రన్, శేఖర్, అంగన్‌వాడీటీచర్స్ యూనియన్‌నాయకురాలుమునియమ్మ, కస్తూరి, శాంత, యూనియన్ నాయకులురూప, నగోమి, ఉషారాణి, రుక్మిణి, దండమ్మ, మృగమ్మ, ఏసుదాసు, దశరథ, దేశప్ప పాల్గొన్నారు.

## కౌన్సిల్‌లోని బిషప్‌లు స్కూలుకు హెడ్‌మాస్టర్ లాంటి వారు..



-బిషప్ కౌన్సిల్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 7 ప్రభాతవార్త:

బిషప్ కౌన్సిల్‌లోని బిషప్‌లు అనే వారు ఒక స్కూలుకు హెడ్‌మాస్టర్ లాంటి వారని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ అభిప్రాయపడ్డారు. శనివారం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని కల్వరి అపోస్తుల చర్చి నందు ఉత్తరాంధ్ర బిషప్ కౌన్సిల్ సమావేశం బిషప్ పామిడి జాన్‌పాల్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డా॥ప్రవీణ్ సభ్యులకు తన సందేశాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక మిషన్ సక్రమంగా పనిచేస్తే దానిలో తయారయ్యే ప్రొడక్ట్స్ కూడా సక్రమంగా ఉంటాయన్నారు. గౌరవ అతిథిగా పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి ఆదిరాజు విచ్చేసి బిషప్‌లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బిషప్ కౌన్సిల్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్‌ను బిషప్‌లు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ బాలరాజు, బిషప్ విక్టర్ పాల్, బిషప్ నవీన్, బిషప్ మోజెస్, బిషప్ సుదర్శన్, బిషప్ పిడి.పాల్, బిషప్ మోహన్‌కుమార్, బిషప్ దేవప్రసాద్, బిషప్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్

తిరుపతి (క్రీడా), జనవరి 7, ప్రభాతవార్త

రాష్ట్ర యువజన సర్వీస్ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆదేశం మేరకు సెట్విన్ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా తిరుచానూరు జడ్పి హైస్కూల్ క్రీడామైదానం దామినేడు పద్మావతి పురం తిరుచానూరు జడ్పి హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు కబడ్డీ, వాలీ బాల్, కోకో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేత అయిన వారికి వివేకానంద జయంతి ఈ నెల 12వ తేది సెట్విన్ కార్యాలయంలో తిరుకార్యక్రమంలో విజేతలకి మెమొంటోళ్లు, సర్టిఫికేట్లు సిఈవో మురళీకృష్ణ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ తిరుచానూరు హెడ్మాస్టర్ మురళి, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ అడ్మినిస్ట్రేటర్ సయ్యద్, సిఈఓ సెటిల్ డా. బి. మురళీకృష్ణ, కె. మోహన్ కుమార్, మేనేజర్ సెట్విన్ స్కేటింగ్ కోచ్ ప్రేమ్‌నాథ్, మధుసూదన్ రెడ్డి, డిఎస్ఏ తిరుపతి కుక్సన్, పిడి పల్లి పాల్గొన్నారు.

## పెన్షన్ల కోసం ఎదురుచూపులు



నిరాశ నిస్పృహాలో లక్షలాది మంది విశ్రాంత ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా సహాధ్యక్షుడు టి. గోపాల్ ఆవేదన

తిరుపతి (విద్య), జనవరి 7, ప్రభాతవార్త

పెన్షన్ల కోసం ఎదురుచూపులు చూస్తూ నిరాశ నిస్పృహాలో లక్షలాది మంది విశ్రాంత ఉద్యోగులు సుదీర్ఘకాలం ఉద్యోగ నిర్వహణలో ప్రభుత్వ పథకాలు అమలు చేసి ప్రజా సంక్షేమాన్ని కృషి చేసి తమ యొక్క శక్తిని దారబోసిన రిటైర్డ్ అయిన తర్వాత పెన్షన్ అనేది విశ్రాంతి ఉద్యోగికి ఒక ఊతం అని అలాంటి పెన్షన్ కోసం విశ్రాంత ఉద్యోగి ఎదురుచూస్తున్నారని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా సహాధ్యక్షుడు టి. గోపాల్ ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల రెండు వారాలు గడిస్తే గాని పెన్షన్లు వచ్చే అవకాశం లేదని విశ్రాంతి జీవితంలో అనారోగ్య సమస్యలు కుటుంబ బాధ్యతలు అనేక సమస్యలతో అటు మానసికంగా ఇటు ఆరోగ్యపరంగా నలిగిపోతున్న సీనియర్ సిటిజన్‌లో మనోవేదనను అర్థం చేసుకోకుండా పాలకులు ఇలా ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్నారు. విశ్రాంత ఉద్యోగి ఆరుపదలు ఏడు పదులు వయసులో ఎన్నో అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారని ప్రతి నెల వారి యొక్క పెన్షన్లసొమ్ములో మూడవ వంతు మాత్రలకుమందులకు ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి అని దీనిని దృష్టిలో ఉంచుకుని పాలకులు భవిష్యత్తులో పెన్షన్లు చెల్లింపులో జాప్యాన్ని తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## డ్రాపౌట్లుపై దృష్టి పెట్టండి :డీఈవో శేఖర్

వడమాలపేట, జనవరి 7 ప్రభాతవార్త:



డ్రాపౌట్లు తగ్గించి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని తిరుపతి డీఈవో డా. శేఖర్ సూచించారు. పాఠశాలల అభివృద్ధి ప్రణాళికపై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా విధానంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలకు సంబంధించిన పూర్తి సమాచారం యూడైస్‌లో పొందుపరచాలని తెలిపారు. యూడైస్‌లో సమాచారం మేరకు పాఠశాల ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటివ్ పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మావతి, ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఉద్యమ కెరటం మార్పు బాలకృష్ణమ్మ

పుత్తూరురూరల్, జనవరి 7 ప్రభాతవార్త:

పుత్తూరు పెన్షనర్స్ భవనంలో శనివారం సాయంత్రం ఉద్యమ యోధుడు మార్పు బాలకృష్ణమ్మ 9వ వర్ధంతి సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెంగ్రాయ మండడి అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుకిరణ్, నాధమునిలు మాట్లాడుతూ మార్పు బాలకృష్ణమ్మ చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, మావుళ్ళయ్య, రాజేంద్ర, బాబు, నరేంద్ర, త్యాగరాజునాయుడు,

## విద్యార్థులకు పక్కాగా విద్యాబోధన

**- జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి**

చిత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త:



పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు పక్కాగా విద్యాబోధన చేయాలని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. జిడినెల్లూరు మండలంలోని జిడి నెల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో విద్యా బోధనపై అడిగి తెలుసుకొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసిన జడ్పీ సిఇఓ విద్యార్థులకు నాణ్యమైన, రుచికర భోజనం పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి నాణ్యతతో పనులు చేపట్టి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో కర్నాటక హైకోర్టు జడ్జి

కాణిపాకం, జనవరి 7 ప్రభాతవార్త:



కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ అశోక్ ఎస్.ఖినగి కుటుంబసమేతంగా శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు శ్రీనివాస్, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న మాజీ సిజెఐ జస్టిస్ రమణ

తిరుమల,జనవరి 7 ప్రభాతవార్తప్రతినిధి:



కలియుగవైకుంఠంలో పవిత్రమైన వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తులను ఆకట్టుకునేలా ఆలయంలోవల, వెలువల ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ అభినందించారు. వైకంఠద్వార దర్శనం కోసం జస్టిస్ ఎన్‌వి రమణ దంపతులు శనివారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామిని, వైకుంఠద్వారంలో దర్శనం చేసుకుని సంతోషం వెలిబుచ్చారు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి శ్రీవారి తీర్థప్రసాదాలు, నూతన సంవత్సరం క్యాలండర్,డైరీలను అందజేశారు.

## కోటలో మూడు ప్రైవేటు ఆసుపత్రులు సీజ్

**- డీఎంహెచ్ఓ శ్రీహరి**

కోట, జనవరి 7 ప్రభాతవార్త

కోటలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మూడు ప్రైవేటు ఆసుపత్రులను తిరుపతి జిల్లా డిఎంహెచ్ఓ శ్రీహరి సీజ్ చేశారు. శనివారం కోటలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. పలు ఆసుపత్రుల్లో సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో ఆ ఆసుపత్రులను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తిరుపతి జిల్లా కలెక్టర్‌కు కోట ప్రజలు ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే కోటలోని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రవికుమార్‌ను విచారించారు. రవికుమార్‌పై పలు ఫిర్యాదులు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ఆదేశాల మేరకు ఈ విచారణ చేపట్టామన్నారు.

## అక్కరపాక గ్రామంలో వెలిగిన వీధిదీపాలు

దొరవారిసత్రం, జనవరి 7 ప్రభాతవార్త

**వార్త ప్రభావం**



దొరవారిసత్రం మండలం అక్కరపాక గ్రామంలో 'వెలగని వీధిదీపాలు' అనే వార్త ప్రచురితం కావడం తెలిసిందే. దీంతో పంచాయతీ కార్యదర్శి మునికృష్ణయ్య, సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు అక్కరపాక గ్రామానికి వచ్చారు. వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న అన్ని వీధిదీపాలను తనిఖీ చేశారు. అనంతరం నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

## వెంకటమ్మకు రేషన్‌కార్డు మంజూరు

పాలసముద్రం, జనవరి 7 ప్రభాతవార్త:

**వార్త ప్రభావం**

మండలంలోని వనదుర్గాపురం ఎస్టీ కాలనీకి చెందిన వెంకటమ్మకు తహసిల్దారు బాబు శనివారం రేషన్‌కార్డు మంజూరు చేశారు. ఇటీవల ఆరు నెలలుగా రేషన్ కార్డు కోసం ప్రదక్షిణ అంటూ 'ప్రభాతవార్త'లో వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి క్షేత్ర స్థాయికి వెళ్ళి వెంకటమ్మను వెతికి పట్టుకొన్నారు. గ్రామ సచివాలయంకు తీసుకెళ్ళి విఆర్ఓ తంగరాజ్ అక్కడికక్కడే ఆమెకు రేషన్ కార్డు మంజూరు చేశారు. రేషన్‌కార్డు మంజూరు చేసినందుకు వెంకటమ్మ 'ప్రభాతవార్త'కు కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి టిడిపి నాయకులకు కనిపించదా?

**చైర్మన్ హరి**

పుత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త :



పుత్తూరులో జరుగుతున్న అభివృద్ధి పనులు తెలుగుదేశం పార్టీ నాయకులకు కనిపించడం లేదా అని మునిసిపల్ చైర్మన్ ఎ.హరి ప్రశ్నించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు భానుప్రకాష్ మంత్రి ఆర్.కె.రోజాపై చేసిన విమర్శలను ఖండించారు. ఆమె నేతృత్వంలో పుత్తూరులో 130 కోట్లతో మంచినీటి పథకాన్ని మంజూరు చేయించారని తెలిపారు. సుమారు రెండు కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటు, రూ. 1.10 కోట్లతో తుడా పార్కు, పార్కులో లక్షల రూపాయలతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు, రెండు కోట్లతో నూతన మునిసిపల్ భవన నిర్మాణం జరుగుతున్నాయని తెలిపారు. వైస్‌చైర్మన్ డి.శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైద్య, విద్యాశాఖల్లోనూ, ఆలయాల్లోనూ ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. కౌన్సిలర్ ఏకాంబరం మాట్లాడుతూ మంత్రి రోజా కరోనా సమయంలో ఆమె చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగరి నియోజకవర్గ ప్రజలకు నిత్యావసర వస్తువులు, మందులు ఉచితంగా అందించారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి తదితర పలు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు జాన్ కెనెడీ, గుణశేఖర్, ఇంకా రెడ్డివారి మోహన్ రెడ్డి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా విడుదల : కలెక్టర్

**- ఎద్దైనా అభ్యంతరాలు వుంటే స్వీకరణకు సిద్ధం**

చిత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త

ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు ఓటర్ల జాబితా సిద్ధం చేసి విడుదల చేశామని దీనికి సంబంధించి ఎద్దైన అభ్యంతరాలు వుంటే స్వీకరించడానికి సిద్ధంగా వున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు, కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ హరినారాయణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ విడుదల చేయడం జరిగిందని, ఆధార్ లింకేజీ మార్చి 31వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. జిల్లా ఎన్‌రోల్‌మెంట్ అధికారి, డిఆర్ఓ రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా విడుదల చేయడం జరిగిందని, జిల్లాలో మొత్తం 15,43,730 మంది ఓటర్లు వున్నారని ఇందులో పురుష ఓటర్లు 7,65,833, మహిళా ఓటర్లు 7,77,784, ట్రాన్స్ జెండర్ ఓటర్లు 113 మంది వున్నారన్నారు. ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు 1,016 మంది మహిళా ఓటర్లు వున్నారన్నారు. మహిళ ఓటర్లు ఎక్కువగా నగరిలో వుండగా తక్కువ కుప్పం నియోజకవర్గంలో వున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల ఫైనల్ జాబితా విడుదల చేయడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లాలో 54,237 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు నమోదు చేసుకోగా, టీచర్ల స్థానానికి 3,545 మంది ఓటర్లుగా నమోదు చేసుకొన్నారన్నారు. ఎమ్మెల్సీ స్థానం మొత్తానికి ఆరు జిల్లాల పరిధిలో గ్రాడ్యుయేట్ స్థానానికి 3,83,061 మంది, టీచర్ల స్థానానికి 26,888 మంది ఓటర్లుగా నమోదు అయి వున్నారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల వారీగా ఇప్పటికే జాబితాలు ఇవ్వడం జరిగిందని, ప్రతి 14 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటర్ల జాబితాపై ఎద్దైనా అభ్యంతరాలు వుంటే నామినేషన్ల రోజు వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌డిసి పర్వీన్, ఆర్డీఓలు శివయ్య, సృజన, తహసిల్దార్లు, బిఎస్‌పి నాయకులు నాగరాజు, బిజెపి నాయకుడు రామభద్ర, సిపిఐ నాయకులు నాగరాజు, కాంగ్రెస్ నాయకులు పరదేశి, టిడిపి నాయకులు వెంకిటీ సురేంద్రకుమార్, వైకాపా నాయకులు మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీలతో సమావేశమైన కలెక్టర్ హరినారాయణన్

# జగనన్న ఇళ్ళకు శాపం

**రోడ్డు వసతి లేక నత్తనడకన ఇళ్ళ నిర్మాణం**

రేణిగుంట, జనవరి 7 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ళ నిర్మాణానికి శాపం పట్టింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేదలకు అన్యాయం జరగకూడదని, లబ్ధిదారులందరికి పార్టీలకతీతంగా అధికారుల ద్వారా ఇంటి స్థలాలను మంజూరు చేయించారు. జగనన్న ఇళ్ళ నిర్మాణపు పనులు త్వరితగతిన పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రేణిగుంట మండలం జిపాళెం పంచాయతీ కుర్ర కాలువలో జగనన్న ఇళ్ళ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. సరైన రోడ్డు వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తుంది. నిర్మాణాలు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశిస్తున్నప్పటికీ రోడ్డు సదుపాయాలు లేక అనుకున్న స్థాయిలో పనులు జరగడం లేదు. నేల బురదమయంగా మారడంతో సిమెంటు, ఇసుక, ఇనుప రాడ్‌ల లోడ్లతో వస్తున్న వాహనాలు బురదలు కూరుకుపోతున్నాయి. దీంతో లబ్ధిదారులకు దిక్కుతోచని అయోమయ పరిస్థితి ఏర్పడింది. దిగబడిపోయిన వాహనాలను బయటకు తీయడానికి మరల వేరే వాహనాలను అద్దెకు తెచ్చుకుని ఎన్నో బాధల పడి బయటకు తీయాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తే త్వరితగతిన నిర్మాణ పనులు జరుగుతాయి.

## వేప చెట్టు నుంచి కారుతున్న పాలు!

వెదురుకుప్పం, జనవరి 7 ప్రభాతవార్త :



పోతులూరు వీరబ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పిన చందంగా వింతలు, విద్దూరాలు జరుగుతున్నాయి అని విన్నాం ...ఐతే ఆయన చెప్పిన వింతలలో ఒక్కటి వెదురుకుప్పం మండలం కురివికుప్పం పంచాయితీ పరిధిలోని అడపాలబైలు గ్రామంలో జరిగిందని ప్రజలకు చెపుతున్నారు. స్థానికుల కథనం మేరకు.. అడపాలబైలు గ్రామ సమీపంలో ఓ వేప చెట్టు పై భాగం నుంచి క్రిందికి పాలు కారుతున్నాయని చెప్పారు. గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో తెలిసిన వారు వింత చూడటంకు తండోప తండాలు వేప చెట్టు వద్దకు చెరుకుని చూసి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.

## ఫ్లెక్సీల ఏర్పాటులో అధికారులు పక్షపాత ధోరణి

**ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని టిడిపి నాయకులు వినతి**

తిరుపతిరూరల్, జనవరి 07 ప్రభాతవార్త:



ఫ్లెక్సీల ఏర్పాటులో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని తిరపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్రాంతి పండగకు నారావారిపల్లికి వస్తున్న తరుణంలో టిడిపి శ్రేణులు చంద్రబాబునాయుడుకు స్వాగతం, పండగ శుభాకాంక్షలు తెలిపే క్రమంలో తిరుపతిరూరల్ మండల పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు శనివారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ కార్యాలయంలో పాలనాధికారి పిచ్చిరెడ్డిని టిడిపి నాయకులు కలిసి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ అధికారులు అధికార పార్టీ నాయకుల తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో పక్షపాతం వ్యవహరిస్తున్నారన్నారు. ఫ్లెక్సీల ఏర్పాటు అనుమతి కొరకు శుక్రవారం ఎంపిడిఓ కోసం కార్యాలయం వద్ద టిడిపి శ్రేణులు గంటల కొద్ది వేచియున్న ఎంపిడిఓ కావాల్సికే రాకపోవడంతో వెనుదిరగాల్సి వచ్చిందన్నారు. అధికార పార్టీ నేతలకు అనుమతి ఇచ్చిన అధికారులు ప్రతిపక్ష పార్టీలకు అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం బాధాకరం అన్నారు. ఇకనైన అధికారులు పక్షపాత ధోరణిని విడనాడి అందర్ని ఒకేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఈశ్వరయ్య, గోపినాథ్, నాగూరు శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, మన్మధకుమార్‌రెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం

చంద్రగిరి, జనవరి 7 ప్రభాతవార్త:



స్థానిక టిటిడి అనుబంధ శ్రీ కోదండరామాలయంలో శనివారం పునర్వసు నక్షత్రంను పురస్కరించుకుని శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం ఆలయ అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకోదండ రామాలయంలో మూలవిరాట్టులకు వేకువజామున అభిషేకం జరిపించారు. శ్రీరామచంద్రుడి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస భట్టార్ ఆధ్వర్యంలో శ్రీసీతారాముల వారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించారు. మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఏఈఓ పార్థసారథి మాట్లాడుతూ యుగపురుషుడుగా కొలువబడుతున్న శ్రీరామచంద్రుడి జన్మనక్షత్రం రోజున శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. కల్యాణోత్సవ సేవలో పాల్గొన దలచిన భక్తులు ఇద్దరికి టిక్కెట్ ధర రూ.300/-లు చెల్లించాలన్నారు. స్వామి వారి కల్యాణోత్సవం అనంతరం దంపతులకు రవిక, పంచె, ప్రసాదం అందజేయబడుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని శ్రీసీతారాముల కృపకు పాత్రులు కాగలరని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణయ్య, అర్చకులు మోహన్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, జనవరి 7 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కళ్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని తిరుప్పావై ప్రవచనం సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అలంకరించి సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, అరుణ్, అర్చకులు పాల్గొన్నారు.

## లక్ష్మీపార్వతి రాహుకేతు దోష నివారణ పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 7ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమి చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి కుటుంబ సభ్యులు కాలసర్పదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. ఆమెకు ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఓ సతీష్‌మాలిక్ సారధ్యంలో వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా ప్రత్యేక రాహుకేతుదోష నివారణ టిక్కెట్టు కొనుగోలుచేసి సహస్రలింగేశ్వరుని సన్నిధి వద్ద పూజలు జరిపించారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల గర్భాలయంలో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత దక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను అందించారు.

## శివయ్యసేవలో ప్రభుత్వ చీఫ్ విప్

శ్రీకాళహస్తి,జనవరి 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం అతిదుల తాకిడి పెరిగింది. శనివారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జగ్గయ్యపేట శాసనసభ్యుడు సామినేని ఉదయభాను శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఎఇఓ సతీష్‌మాలిక్ వేదపండితులతో ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లను టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు హరియాదవ్, సురేష్‌రెడ్డిలుపర్యవేక్షించారు.

## శివయ్య సన్నిధిలో ప్రముఖ క్రికెటర్ వివిఎస్‌లక్ష్మణ్

శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి విశ్రాంత క్రికెటర్ వివిఎస్.లక్ష్మణ్ కుటుంబసమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయ దక్షిణగోపురం వద్ద ఎఈవో సతీష్‌మాలిక్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను ప్రత్యేక దర్శనం చేసుకోవడంతో పాటు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమాల్లో ఎసి మల్లికార్జున ప్రసాద్, ఎఈఓ సతీష్‌మాలిక్, ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, సురేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## పరిశ్రమలతో పాటు విద్యాభివృద్ధిలోనూ మేటి

**- శ్రీసిటి ఎండి రవీంద్ర సన్నారెడ్డి**



తడ, జనవరి 7 ప్రభాతవార్త

గ్రామీణ నేపథ్యంలో పట్టణాలకు ధీటైన అధునాతన విద్య సౌకర్యాలు శ్రీసిటి ప్రత్యేకత అని డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. శ్రీసిటిలోని అకార్డ్ స్కూలు ప్రథమ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శ్రీసిటి ఎండితో పాటు సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ అసోసియేట్ డైరెక్టర్ ఆర్.వెంకటరామన్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కన్నాభిరాన్, తమిళనాడు రాష్ట్ర ప్రణాళికా సంఘం సభ్యుడు సుల్తాన్ ఇస్మాయిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు, క్రీడాస్థలం, ఇతర అన్ని వసతులతో గ్రామీణ వాతావరణంలో ఆధునిక పాఠశాలను ఏర్పాటు చేసిన అకార్డ్ స్కూలు యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి పెట్టాలని, సతీష్‌ధవన్, అబ్దుల్‌కలాం వంటి శాస్త్రవేత్తల నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకోవాలని షార్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వెంకటరామన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అకార్డ్ స్కూలు ఛైర్మన్ వి.చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రశాంత్, వివేక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా పనిచేయాలి

**వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి**

వెంకటగిరి, జనవరి 7, ప్రభాతవార్త:

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా అందరూ పని చేయాలని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన సందర్భంగా ఆయన శనివారం రాత్రి వెంకటగిరికి వచ్చారు. వెంకటగిరిలో ఆయనకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి తనపై ఉన్న నమ్మకంతో నియోజకవర్గ సమన్వయకర్తగా ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర కమ్యూనిటీ బోర్డ్ డెవలప్‌వమెంట్ చైర్మన్, తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్ష పదవులు కూడా ఇచ్చారని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు అభివృద్ధి పనులు జరగడంలేదని సీఎం జగన్మోహన్‌రెడ్డి తనను సమన్వయకర్తగా నియమించారని చెప్పారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి నమ్మకాన్ని ఒమ్ము చేయనని తెలిపారు. సమన్వయకర్త అంటే ఏమిటో రాను రాను అందరికీ తెలియజేస్తాని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, పార్టీ నాయకులు ఢిల్లీ బాబు, చిలికం శంకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.



## జాతీయ ఫెన్సింగ్ పోటీలకు శ్రీ కోదండ రామస్వామి పాఠశాల విద్యార్థిని ఎంపిక

తిరుపతి (క్రీడ), జనవరి 7, ప్రభాతవార్త



కొచ్చిన్‌లో జరుగనున్న 24వ సబ్ జూనియర్ జాతీయ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ కోదండరామ స్వామి ఆంగ్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని రమ్యశ్రీ ఎంపికైంది. కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జనవరి 10 నుండి 13వ తేది వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా టిటిడి జేఈఓ సదాభార్గవి విద్యార్థిని అభినందించారని విద్యాశాఖాధికారి ఎం. భాస్కర్ రెడ్డి చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అదే విధంగా ఫెన్సింగ్, టైక్వాండో టిటిడి కోచ్ గోపినాయుడును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సురేంద్ర బాబు పాల్గొన్నారు.